రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

700 మందికి ఉచిత వైద్యసేవలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్, సత్యసాయి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సరహద్దు కర్ణాటకలోని కదిరన్నగారిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ సభ్యులు అష్రఫ్, దీపక్, మంజు, అశ్వర్థ నారాయణ, నవీన్, విజయ్, వేణు తదితరులు 700 మంది రోగులకు ప్రత్యేక విభాగాల డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు.డిపో నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరుతుందన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు కొండకు షటిల్ తిరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ఆశయం

వాల్మీకిపురం: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని టి.సాకిరేవుపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 215 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 2 2మందిని ఆరోగ్యశ్రీ పథకం కింద సిఫార్సు చేసినట్లు తెలిపారు. అలాగే జర్రావారిపల్లి, గండబోయనపల్లి పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ఎంపిటిసి రెడ్డెప్ప, ప్రత్యేక అధికారి శివరామక్రిష్ణ, డాక్టర్లు శ్రీవిద్య, నయీమ్, విజయలక్ష్మి, భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

95.6 శాతం పింఛన్లు పంపిణీ

కలకడ : మండలంలో 95.6 శాతం మందికి పింఛన్లు, 11.5 శాతం మందికి నిత్యవసర సరుకులు ఇంటింటికీ అందజేసినట్లు ఎంపీడీఓ మనోహర్ రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు. ఆదివారం ఉదయం 5గంటల నుంచి 5585 మందికి గాను 5508 మందికి పింఛన్లను వలంటీర్‌ల ద్వారా అందజేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం హైస్కూల్‌కు చెందిన 1992–1993 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల అనంతరం ఒకచోట కలసి పాఠశాలలో చేసిన అల్లరి పనులు, మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. రాజారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కాలేషా, వంకవరస మోహన్, మూరెళ్ళ సోమశేఖర్, మంజునాథ్, మోహన్‌రెడ్డి, లక్ష్మీదేవి, మమత, శారద తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని డీపీవో ధనలక్ష్మీ అన్నారు. ఆదివారం చారిత్రాత్మక గుర్రంకొండ కోటలో స్వచ్ఛతా హి సేవా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో 300 మీటర్ల జాతీయజెండాతో విద్యార్థుల ర్యాలీ, పారిశుధ్య కార్మికులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, తంబళ్లపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులతో కలసి స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కలికిరి సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ–3), సైనిక పాఠశాల విద్యార్థులు, జేఎన్టీయూ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రపరచారు. – సాక్షి నెట్ వర్క్



గుర్రంకొండలో 300 మీటర్ల జాతీయజెండాతో ర్యాలీ



గ్రీన్ అంబాసిడర్లలకు సన్మానం



పీలేరు: మొక్కలు నాటుతున్న దృశ్యం



కలికిరి : యల్లమ్మ ఆలయ ఆవరణలో పరిశుభ్రత పనులు









కలకడ బస్టాండ్‌లో పరిశుభ్రత పనులు , నిమ్మనపల్లె సచివాలయ పరిసరాలు శుభ్రం చేస్తూ.., బి.కొత్తకోటలో స్వచ్ఛతా హి ర్యాలీ, వాల్మీకిపురం : కోర్టు ఆవరణంలో ..

వృద్ధాప్యం శాపంకాదు.. జీవితంలో ఓ భాగం

పీలేరు : వృద్ధాప్యం శాపం కాదు.. జీవితంలో ఓ భాగమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. 80 సంవత్సరాలు వయస్సు నిండిన ఓటర్లను పూల మాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామ్మోహన్, డీటీ సుబ్రమణ్యం, వీఆర్‌వోలు యర్రయ్య, సురేష్‌కుమార్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అనిబిసెంట్ సేవలు చిరస్మరణీయం

మదనపల్లె : దివ్యజ్ఞాన సమాజం స్థాపకురాలు, సామాజిక సేవకురాలు ఐరిష్ వనిత డాక్టర్ అనిబిసెంట్ సేవలు చిరస్మరణీయమని బీసీటీ ట్రస్ట్ కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నం, పూర్వవిద్యార్థులు తెలిపారు. ఆదివారం అనిబిసెంట్ జయంతి సందర్భంగా స్థానిక అనిబిసెంట్ సర్కిల్‌లో, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బెసెంట్‌హాల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మదనపల్లెలో విద్యావ్యాప్తికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. మదనపల్లె చరిత్రపుటల్లో అనిబిసెంట్, ఆమె స్థాపించిన దివ్యజ్ఞానసమాజం, బీటీ కళాశాల చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. కార్యక్రమంలో బీటీ కళాశాల పూర్వవిద్యార్థి, ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ మూడేదామ్లానాయక్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దండాలరవిచంద్రారెడ్డి, మునిగోపాలకృష్ణ, శివకుమార్, విజయకుమార్, లైబ్రేరియన్ వేణు, నాగరాజు, బీటీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అనిబిసెంట్ సర్కిల్‌లో విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పూర్వవిద్యార్థులు

కష్టపడితేనే ఉన్నత స్థానం

మదనపల్లె సిటీ: విద్యార్థులు కష్టపడితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అనపగుట్టలో క్రై, ఫోర్డు సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్ రిసోర్సు సెంటర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గతంలో విద్యార్థులు చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ప్రభుత్వం నాడు–నేడు కింద పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి చేరుకున్నాయన్నారు. మురికివాడల్లోని పిల్లలు సాంకేతిక విద్యను అందబాటులో తెచ్చేందుకు ఫోర్డు సంస్థ కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నెల రోజుల పాటు ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ, 22వవార్డు కౌన్సిలర్ ముబీనా, ఫోర్డు సిబ్బంది ప్రమీల, రాధారాణి, రమేష్,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు ఎంపీకి వినతి

వాల్మీకిపురం: వాల్మీకిపురం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులతో కలసి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎంపీ మిథున్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత వంద సంవత్సరాలుగా ఇక్కడ రైల్వే స్టేషన్ ఉందని, గతంలో ఇక్కడ హైదరాబాద్, విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపేవారని తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపడం లేదన్నారు. దీంతో గుర్రంకొండ, పెద్దమండ్యెం, మర్రిపాడు, తరిగొండ, చింతపర్తి, నిమ్మనల్లి, వాల్మీకిపురం ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రైల్వేమంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సాధిక్, అషర్, సబ్దార్ అలి ఖాన్, సైఫుల్లా, ఇర్ఫాన్, సాధిక్, శ్రీధర్‌రాయల్, బబ్లూ, షాహెద్, సందాని, అష్రఫ్ పాల్గొన్నారు.



ఎంపీ మిథున్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చింతల, స్థానిక నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరమణ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా కింద రూ. 5 లక్షలు మంజూరు చేపించడానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె : ప్రపంచ సెరెబ్రల్ పాల్సి డే సందర్భంగా అక్టోబర్ 3 నుంచి 10 వరకు సెరెబ్రల్ పాల్సి వ్యాధిగ్రస్తులకు తిరుపతి అమరహాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ సీఈఓ వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. ఆదివారం ఆస్పత్రి వారు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సెరెబ్రల్ పాల్సి(మస్తిష్క పక్షవాతం) సాధారణంగా పుట్టుకకు ముందు లేదా తర్వాత జీవితంలో బాల్యదశలో, మెదడు ఎదుగుదలలో లోపం వల్ల లేదా అసాధరణతల వల్ల ఏర్పడే నరాల సంబంధిత రుగ్మత అన్నారు. చిన్నపిల్లల్లో ఎలాంటి ఎముకల, నరాల సమస్యలు ఉన్నవారందరికీ వారంరోజుల పాటు ఆస్పత్రిలో డాక్టర్‌లతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

గుర్రంకొండ: మండలంలోని గంగిరెడ్డిగారిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆనంద్‌ను పరామర్శించారు. అలాగే రామాపురం పంచాయతీ లక్కావాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముదివేటి వెంకటరమణ(70) మృతి పట్ల ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరమణ ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని వెంకటరమణ మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.